
కథ

# మరో ఎయిడ్స్

రాజేంద్ర




టెలిఫోన్ చేసి వెళ్లడమా... హఠాత్తుగా వెళ్లి ఆశ్చర్యానందాలలో ముంచడమా? ఎంతసేపు బుర్రబద్దలు కొట్టుకున్నా... గెడ్డం పీక్కున్నా (జుత్తు పీక్కుందామంటే బట్టతల కూడా కాక మొక్కు గుండుమరి) తేలలేదు. గోపాలం చిన్నప్పటినుంచీ నిత్యశంకితుడే. దేనిగురించేనా చటుక్కున నిర్ణయించుకోలేకపోవడం అతని అలవాటు.

పదేళ్ల తరువాత యీ ఊరు వచ్చాడు- స్వామి కార్యంమీద. ఇక్కడ కొందరు మిత్రులున్నారు. టెలిఫోన్ తీగలమీదా, కంప్యూటర్ స్క్రీన్ మీదా వాళ్లతో పలకరింపులు సాగిస్తూనే ఉన్నా ప్రత్యక్షంగా చూస్తే కలిగే ఆనందం వేరు కదా. అందుకని గోపాలం తహతహలాడుతున్నాడు. కరంటు కోత... కరువు... వీటితో కొట్టుకుంటున్న ఆంధ్రప్రదేశ్‌లో తన మిత్రులెలా ఉన్నారో ఓసారి చూసి... మాట్లాడి .. ధైర్యం చెప్పాలన్నది కూడా అతని ఉద్దేశమే.

గోపాలనికన్నీ అనుమానాలే. మిత్రులతో ముందుగా ఎవరిని కలుసుకోవాలి?

చీటీలు వేసి ఆ సమస్యని పరిష్కరించుకున్నాడు ఇక మిగిలింది- టు బి ఆర్ నాట్ టుబి ఇట్ ఈజ్ ఎ మిలియన్ డాలర్ క్వశ్చన్. పడతోసి తన్నాలా... తన్నేసి పడదొయ్యాలా అని చిన్నప్పుడు వేధించిన సందేహంలాగే- యిప్పుడీ సందేహం బాధిస్తూంది.

నిట్టూర్చాడు... శూన్యంలోకి చూశాడు. సిగరెట్ కాల్చాడు. ఏం చేసినా అతను కర్తవ్యం నిర్ణయించుకోలేకపోయాడు. అప్పుడు తనకొక ఉపాయం తట్టింది. షర్టుజేబులో ప్యాంటుజేబులో తడిమాడు. రూపాయికాసు దొరికింది. గాలిలోకెగరేశాడు. బొమ్మపడింది. కాని... అతనికి తను చేసిన పొరపాటు తెలిసివొచ్చింది. బొమ్మపడితే ఏం చెయ్యాలి. బొరుసు పడితే ఏం చెయ్యాలి.. అనేది అంతకుముందు అనుకోలేదు. ఈసారి అది తేల్చుకుని గాలిలోకి నాణెం ఎగరేశాడు. కానీ... నాణెం ఏ మూలకి.. దేనికిందకి పోయిందో... కనపడలేదు. హోటలు గదినిండా సామానులే. వెదికి వేసారి... మరో నాణెం తీశాడు. అది- ఎటువేపు బొమ్మో ఎటు వేపు బొరుసో ఒక పట్టాన అర్థం కాలేదతనికి. ఎలాగైతేనేం అది నిర్ణయించుకుని నాణాన్ని గాలిలోకెగరేశాడు -

మంచంమీద పడేలా.

అలాగ అతను డెసిషన్ మేకింగనే గండం గట్టెక్కాడు. హోటలు నుంచి బయటకొచ్చాడు. నిత్యశంకితుడయిన గోపాలానికన్నీ అనుమానాలే కదా. ఈసారి మళ్లీ అనుమానమొచ్చింది. ఆటోలో వెళ్లాలా, కారులో వెళ్లాలా? కారులో వెళ్తే తన హోదాకి తగ్గట్లుంటుంది. ఆటోలో వెళ్తే మిత్రులు మధ్యతరగతివాళ్లు కనక వాళ్ల హోదాకి తగ్గట్లుంటుంది. మరేం చెయ్యాలి? బొమ్మ బొరుసు వేద్దామంటే నడిరోడ్డాయే. మళ్లీ రూముకి వెళ్లి వాణెంమీద డెసిషన్ మేకింగ్ చేద్దామా అనుకున్నాడు కానీ- ఏదో ఆటో అతని పక్కనే ఆగటం... ఆటోవాడు ఎక్కడలేని ఆప్యాయతా వొలకబోసేస్తూ 'రండి సార్' అని ఆహ్వానించడంతో- చటుక్కున ఎక్కి కూర్చున్నాడు... ఆలోచించడానికి వ్యవధిలేక. ఆటోవాడికి అడ్రస్ చెప్పాడు.

'ఆటో! నువ్వు ఆఘమేఘాలమీద పోతున్నట్లుందే! నాకు అర్జంటు పనేమీ లేదు." ఆటో వేగానికి ప్రాణభయం కలిగి గద్గదిక స్వరంతో చెప్పాడు వొణికిపోతూ.

"ఇక్కడ రోడ్లుండవు కదండీ. అంచేత మేఘాలమీదే పోవాలి." నవ్వాడాటో. చూడబోతే నీ ప్రాణాలు మేఘాలలోకి పోయేటట్లున్నాయి- అనుకున్నాడు గోపాల్. బతికుంటే దేముడికి కొబ్బరికాయ కొడతానని మొక్కుకున్నాడు. అతను బతికే దిగాడు ఆటో. మిత్రుడి వాటా తలుపులు ఓరగా తెరిచి ఉన్నాయి. లోపలినుంచి మాటలు వినబడుతూంటే- మాటల మధ్యలో వెళ్లడం సభ్యత కాదని ద్వారం ఇవతలే ఆగిపోయాడు. అయినా అతనికి వారి మాటలు వినబడుతూనే ఉన్నాయి.

"సరోజా! ఈ పూటైనా ఎంగిలిపడు. వారంరోజులై పోతోంది నువ్వన్నంతినీ, నాకు తిండి పెట్టి." భార్యని బతిమాలుతున్నాడు.

"ఎలా తింటానండీ? ఇంట్లో శవముండగా తినగలనా!" ఏడుస్తుందా స్త్రీ.

"చనిపోయినవాళ్లకోసం మనమూ చనిపోలేముగా. సోమవారం పోయిందత్తయ్య. ఇవ్వాళ ఆదివారం... అంటే... ఏడురోజులు..."

"చనిపోయిన అత్తయ్య సామాన్యమైన మనిషా! ఆమె శవంమీద పడి ఒక్కొక్కరూ ఏడుస్తూ ఆమె తమ జీవితానికెలాటి వెలుగునీ మలుపునీ యిచ్చిందో వివరంగా చెబుతూంటే విన్నవారికి తెలుస్తుందావిడ గొప్పతనం. అలాటి గొప్పమనిషి చనిపోయినందుకు వారంకాదు, నెలరోజులు అన్నం మానేసినా తక్కువే. అత్తయ్య ఆదర్శమహిళండీ..."

గోపాలానికేమీ అర్థం కావడం లేదు. అర్థంకాకపోడం వల్ల అతనికి మరింత భయమేసింది. ఇంట్లో శవం! వారం రోజులనుంచీ! భార్య అత్తమ్మంటూంది, అంటే... రఘు తల్లా? వారంరోజులుగా దహన సంస్కారాలకి నోచుకోకుండా శవం ఇంట్లో ఉండడమేమిటి? గోపాలానికన్నీ సందేహాలే. లోపలికి వెళ్లి తెలుసుకునే ధైర్యం లేదు. టెలిఫోన్ చేసి తెలుసుకుందాంలే అని అక్కణ్నించి వెనక్కి తిరిగాడు... వాళ్ల కంటపడితే.. రాత్రి తను రైలెక్కడం కుదరదేమో అని. కష్టంలో ఉన్న వాళ్లని చూస్తూ చూస్తూ ఎలా వొదిలేయగలడు? అక్కడినుంచి మళ్లీ ఆటో ఎక్కాడు. ఆటోలో కూర్చున్నా అతన్ని కొన్ని అనుమానాలు కందిరీగల్లా కుట్టడం మానలేదు.

శవమున్న ఇంట్లో- రఘు, భార్య తప్ప మరెవరూ ఉన్నట్లు కనిపించరేమీ? శవం వారం రోజుల పాటుంటుందా? కుళ్లిపోకుండా మామూలు యింటి వాతావరణంలో? రఘుకి చిన్నప్పుడే వాళ్లమ్మ పోయింది కదా?. "సర్... మీరు దిగవలసిన చోటొచ్చింది" ఆపాడు ఆటో.

"దిగవలసిన గొయ్యి." అనుకున్నాడు గోపాల్ -వేసిన కాలు అడుగున్నర వరకూ అంచనా తప్పి అడుగున పడగా. కాలినరం కరేల్ మంది.

ఎలాగో శ్యామ్ అపార్ట్‌మెంట్ చేరుకున్నాడు- రెండతస్తుల మెట్లెక్కి.



తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. కారిడార్‌లోనే మెట్లెక్కిన అలసట తీర్చుకున్నాడు కనుక హఠాత్తుగా ప్రత్యక్షమై ఆనందపరవశులని చేద్దామని తలుపుమీద చెయ్యి వేయబోయాడో లేదో-

లోపల్నించి... ఒకేసారి... అనేక కంఠాలు... కోరస్‌గా... వినేవాళ్ల చెవులు చిల్లులు పడేలా.. గుండెలదిరేలా...

"రనౌట్!" పెనుకేక.

ఆ అరుపుకదిరిపోయాడు గోపాలం. ఆ కేకకి ... తనక్కడినుంచి బయటకు శరవేగంతో పరుగెత్తసాగాడు. కాలినొప్పికూడా మరిచిపోయి. ఆ పరుగులోకూడా అతన్నొక సందేహం సతమతం చెయ్యకుండా వదల్లేదు. 'రన్‌వే' అనకుండా రనౌట్ అనెందుకరిచారు? వాళ్లు ఇంగ్లీషులో అంత పూరా? వాళ్లుద్దేశం తను లోపలికి రాకుండా బయటినుంచే పోవాలని కాబోలు, అందుకే రనౌట్ అని అరిచి వుంటారు. అయినా... అదేమిటి? అతిథిని.. మిత్రుణ్ని... మోహమైనా చూడకుండా.. ద్వారంలోనికయినా రానివ్వకుండా- అక్కడినుంచే రనౌట్ అంటూ తరిమెయ్యడమేమిటి కేకలతో? తను అతిథే కాని అడుక్కునే వాడు కాదు కదా? శ్యామ్ యింటికెవర్నీ రానివ్వని దుర్మార్గుడెప్పుడైపోయాడూ?

"సార్!"

పరుగెడుతున్న గోపాల్ ఆగి అటు చూశాడు. "మీరెవరు?"

"శ్యామ్ సుందరిగారి ఎదుటి ఫ్లాట్‌లో ఉంటున్నవాళ్లం."

"నేను అతని ఫ్రండ్‌ని.. గోపాల్‌ని. ఎన్నో ఏళ్ల తరవాత వొస్తే- రాకరాక వొస్తే- నీ మిత్రుడు.. తనవారితో కలిసి రనౌట్ అంటూ

## అది లేకుండా బతకలేరు!

నేటి యువతకు చేతుల్లో ఎప్పుడూ మొబైల్ వుండాలి. దానికి తప్ప మరో వస్తువుకు వారు అసలు ప్రాధాన్యం ఇవ్వటమే లేదు. ఇటీవల జరిపిన ఓ సర్వేలో తేలిందేమిటంటే, పాతిక నుంచి ముప్ఫయ్యేళ్ల వయసున్న వారిలో 46 శాతం మంది మొబైల్స్‌తో వున్నారు. అది కనుక పోగొట్టుకుపోతే, వాళ్లు పిచ్చాళ్లలా అయిపోతున్నారట! .. వేయి విధాలన్నారు మరి!

అరిచి తగిలేశాడు పైనుంచే." దుఃఖించాడు గోపాలం. అతని దుఃఖానికి కాలునొప్పి కూడా కొంత కారణమే.

"మీరపార్థం చేసుకున్నారు " జాలిగానూ సీరియస్‌గానూ కూడా ఉందతని కంఠం. అతని చూపుకూడా డిటో లాగే వుంది.

"నేనా! అపార్థమా!" ఆశ్చర్యమూ, అనుమానమూ కూడా ఏకకాలమందే ప్రదర్శించాడు గోపాలం.

"మీరే. అపార్థమే." నొక్కి వక్కాణించాడుతను.

"ఎలా?" మొహం ప్రశ్నార్థకపు గుర్తులా నిలువుగా సాగదీసి మరీ అడిగాడు గోపాల్.

"కోపాలొద్దు గోపాల్‌గారూ. నేను మీ శ్రేయోభిలాషినే కాని శత్రువుని కానని మీరు నమ్మితే మీ విషాద అవమానభరిత పాడుపుకథ విప్పేస్తాను"

"మీరు నా శత్రువుకాదు, మిత్రులే. అని ప్రమాణం చేస్తున్నాను. ఇకనైనా సమాధానం చెప్పండి మహాశయా." వేడుకున్నాడు.

"గుడ్ బాయ్!... వినండి. ఇప్పుడు ఆంధ్రదేశాన్ని కొన్ని పట్టి పీడిస్తున్నాయి"

"ఔను. పవర్ కట్.. కరువు... తాగునీటి కొరత... మొదలగునవి."

"ఏంతమాత్రమూ అవి కాదు. అవన్నీ పేపర్లవాళ్లూ ప్రతిపక్షం వాళ్లూ వ్యాప్తి చెందించేవి. వాటిలో నిజం తక్కువా, ప్రచారం ఎక్కువా ఉంటాయి. కావాలంటే చూడండి మీరే. జనరేటర్లు.. ఫైవ్ స్టార్ హోటళ్లు.. వీధులు తిరిగికూడా అమ్ముతున్న బీరు మొదలైన లిక్కర్లు.. ఒకప్పుడు రత్నాలు, రాసులుపోసి అమ్మితే... యిప్పుడు రమ్ము, బీరులమ్ముతున్నారు. వీధికి నాలుగు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు. ఇంక కరువెక్కడ?"

"నిజమే." ఒప్పేసుకున్నాడు గోపాలం. "మరి ఆంధ్రదేశాన్ని పట్టి పీడిస్తున్నవి... అంటూ ఏమిటో అన్నారు.. అవి సెలవివ్వండి" అన్నాడు వినయంగా.

"నేను సెలవిచ్చేదేమిటి? ఇవాళ ఆదివారం. పబ్లిక్ హాలిడే."

"ఆ సెలవు కాదు. వినయం వొలకబోసేటప్పుడంటారే.. ఆ సెలవు"

"ఓహో" అదా"..." నవ్వేసి "ఆంధ్రప్రదేశంతా టీ.బీ. అంటే నమ్మండి." అన్నాడంతలోనే యమ సీరియస్సయిపోయి.

"టీబా అంటే?"

"టీవీ బాధిత. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్.. కనుక ఆంధ్రప్రదేశ్ అంటే.. ఆంధ్ర రాష్ట్రప్రజలు టివి. బాధితులు అని. ఏమిటలా చూస్తారు? నేన్చెప్పేది ఆశ్చర్యంగా ఉందా?"

"అది కాదు..."

"కానిదేందుకూ? ఐనదే చూద్దాం. ఇందాకా మీరు మీ ఫ్రండింటిలోంచి అందుకున్న రనౌట్ అన్న స్వాగతానికి హేతువూ, మూలమూ ఏమిటనుకుంటున్నారు?"

"ఏమనుకుందుకైనా బుర్ర పనిచేస్తే కదా ఆ పెనుకేకకి..."

"నేను చెప్తాను వినండి. టీవీలో వెస్టిండీస్ ఇండియాల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ వొస్తూంది "

"ఐతే?"

"మీరు క్రికెట్ చూడరా?" నడుస్తూనే అడిగాడు.

"నాకు చేతినిండా పనుంటుంది మా వూళ్లో..."

"పనుందని చెప్పి క్రికెట్ చూడ్డం మానేసుకుంటారా? హి హి హి..." నవ్వి


"మా ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ మ్యాచ్ టీవీలో రావాలేకాని ఆడవాళ్లు వంటలెగ్గొట్టి ... పిల్లలు బళ్లెగ్గొట్టి.. ఉద్యోగులు పనెగ్గొట్టి... తాతగారు పూజలెగ్గొట్టి కూడా చూస్తారు. అంతే తప్ప ఇండియా ఆడే మ్యాచ్ చూడకుండా వొదల్రు. మా వాళ్లంతటి క్రికెట్ క్రీడా ప్రోషకులు; మావాళ్లదంతటి దేశభక్తి. ఇక్కడి ఆడవాళ్లు టి.వి. చేత వుస్తె కట్టించేసుకుంటారంటే నమ్మండి. ఇప్పుడిక్కడ పతిభక్తి, మాతృప్రేమ మొదలయినవాటి స్థానాలని టీ.వీ. ఆక్రమించేసుకుంటోంది. టీవీ సీరియలూ, జీవితమూ వేరుకావనేంతగా మమేకం ఐపోతున్నారు మా ఆడవాళ్లు. క్రికెట్టయితే- ఆడా మగా; పిల్లా పాపా; యిరుగూ పొరుగూ అంతా కలిసి టీ.వీ. ఎదురుగా గ్యాలరీ ఐపోతారు. వెస్టిండీస్ వారెవరో రనౌటయ్యుంటాడు. వీళ్లందరూ ఉత్సాహం పట్టలేక ఒక్కుమ్మడి అరిచారన్నమాట- అంపైర్ మరి కాదనలేకుండా. సరిగ్గా అదే క్షణానికి మీరు ద్వారంలో ప్రవేశించబోవడం కాకతాళీయం. అంతే తప్ప మిమ్మల్ని గెటౌటని కాదు."

"అంతే అంటారా?" అన్నాడు గోపాల్ అనుమానంగానూ, ఆశ్చర్యంగానూ ప్లస్ అయోమయంగానూ.

"అంతే... అంతే... అంతే. మీరు నన్ను విశ్వసిస్తానని వాగ్దానం చేశారు. అన్నట్లు మీరు నాదొక సజీవ... వాస్తవ జోక్ వినాలి- కృతజ్ఞతా సూచకంగా కాని... మరెలా అయినా కాని.. ఆ... మేము కాలేజీలో చదువుకుంటున్న రోజులు. తెలుగు మాస్టారికి ఇంగ్లీషు మాట్లాడాలని మహా యావ. అయనొట్టి తెలుగు పండితుడు మాత్రమే. ఓసారి క్లాసుకి ఒక స్టూడెంటులాలస్యంగావొస్తే- గెటౌట్ అన్నాడు. అంతేచాలన్నట్లు ఆ కుర్రాడు బయటకి నడవసాగాడు. తనమాట వినే విద్యార్థికూడా ఉంటాడనుకొని ఆ తెలుగు మాస్టారికతన్ని క్లాసులోకి రమ్మనడానికేమనాలో కంగారులో తోచక... అతనికంటే ముందు పరుగెత్తి.. ఆపి... ఎదురుగా నిలుచుని.. గెటౌట్ యింటూ ద క్లాస్ రూమ్- అని క్లాసురూము వేపు చెయ్యి చూపుతూ అరిచారు." అని తను నవ్వి లీడ్ యివ్వగా గోపాలం కూడా నవ్వాడు.

"థాంక్స్... అరె! మనం మాటల్లో పడి చాలాదూరం వచ్చేశాం!"

. కవులు మాటలని తూటాలు చేసుకుంటే మనం ఆటోల్ని చేసుకున్నాం. దూరమే కాక కాలమూ చాలానే ప్రయాణించాం మాటలమీద. పనసకాయ దొరికినప్పుడే తద్దినం పెట్టాలని వూర్వోక్తి. హోటలు దగ్గర కొచ్చినప్పుడే భోజనం చేసెయ్యమని నేటోక్తి. మీరూ భోజనానికొస్తారా?"



## సంబంధం వద్దన్నాట్ట

ఇంకెవరిది? ఐశ్వర్యారాయ్‌ను పెళ్లాడతానని ప్రస్తావన తీసుకొస్తే తల్లి వృందారాయ్ అంగీకరించిందట కానీ, తండ్రికి మాత్రం తమ కుమార్తె ఐశ్ ముందు ఏ కుర్రాడూ పనికిరాడనిపించిందో, ఏమో! వివేక్ ఒబెరాయ్ వచ్చి అడిగితే తిరస్కరించేశాట్ట. పైగా ఐశ్‌ను గట్టిగా హెచ్చరించాట్ట కూడా, అతనితో ప్రేమవ్యవహారాలు తెంచుకోమని. ఐశ్ గత ఏడాది తన పుట్టిన రోజుకు వివేక్ బహూకరించిన కుక్కపిల్లను తన సెక్రెటరీ ద్వారా తిప్పి పంపించేసిందట. వివేక్, ఇంకేదో చెయ్యాలి ఆమె తండ్రిని పటాయించేందుకు!

అడిగాడు గోపాలం మర్యాదకి.

"రాను. నేనింటి బాధితుణ్ణి, యింతి బాధితుణ్ణి."

"మళ్లీ రాడానికి నాకు టైము లేదు. నేనొచ్చి వెళ్లాననీ... జరిగినదీ శ్యామసుందర్‌కి చెప్పండి."

"కథలోలాగ యిలాగ జరిగాక చెప్పకుండా ఉండగలనా?"

గోపాలం హోటల్లోకి నడిచాడతనికి చెయ్యూపి.

ఒక టేబులు దగ్గర ఎదురెదురుగా రెండు కుర్చీలు... ఒక దాన్లోనే శాల్తీ. అక్కడికి వెళ్లి.. అతనెదురుగా కూర్చుని... ముఖంలోకి చూశాడు. అంతే. గోపాలం దుఃఖం కట్టలు తెంచుకుంది.

"రఘూ!" అంటూ అతనిమీదకు వాలిపోయి... అతన్ని పట్టుకుని విలపించసాగాడు.

"ఎవర్నువ్వు?"

"ఎంత విషాదమైతే మాత్రం స్నేహితుణ్నే గుర్తించలేకపోతున్నావా? అయ్యో... రఘూ... నీకెంత కష్టమొచ్చిందీ! నేను.. గోపాల్‌ని.. రఘూ! మనిషికేవయినా రెండుండొచ్చు. కాని కన్నతల్లి మాత్రం ఒక్కతే ఉంటుంది. అలాటి.. ఏకైక కన్నతల్లిని.. రెండుసార్లు.. ఒకసారి కాకుండా రెండుసార్లు కోల్పోడమంటే... దారుణం.. ఘోరం."

"షటప్ ... ఏమిటి నువ్వనేది?" అని గోపాల్‌ని వారించి- అప్పటికే తమచుట్టూ మూగుతున్న వారిని "మావాడికి కొంచెం స్క్రూలూజు. ఆ మధ్యనే మెంటలాస్పిటలునుంచి విడుదలయ్యాడు. జనాలూ! వెళ్లి భోజనాలు చేసుకోండి, ప్లీజ్." అని వాళ్లని వాళ్ల స్థానాలలోకి తోలేశాడు రఘు- బతిమాలి.

"ఏమిట్రా ఇడియట్ నువ్వనేది? అమ్మని రెండుసార్లు కోల్పోడమేమిటి?" అని గోపాల్‌మీద ఎగిరాడు.

"ఔనూ... ఇంట్లో శవాన్ని పెట్టుకుని.. వస్తులున్న భార్యనుంచి.. నువ్విలా హోటల్‌కి వొచ్చి మెక్కడమేమిట్రా! పత్నీ ద్రోహీ... రఘురాముడనే పేరుకి తప్పబుట్టావు కదరా."

"ఇంట్లో శవమేమిట్రా?" తెల్లబోయాడు రఘురామ్. "నీమాటలు నాకేమీ అర్థం కావడం లేదు. ఒక్క ముక్కకూడా..."

గోపాల్ తనీవూరు పనిమీద రావలసి రావడమూ.. హోటల్‌లో దిగక తప్పక పోడమూ, పొద్దున్న బయలుదేరి వాళ్లింటికి వొచ్చేసరికెదురయిన సీనూ, వినబడిన డైలాగులు .. ఏడుపూ... అన్నీ చెప్పాడు అన్నం తింటూనే.

అప్పటికి అతని కథ వినడమే కాక అన్నం తినడంకూడా ముగించిన రఘు ఒక్కసారి భళ్లున నవ్వాడు.

"నవ్వుతావేం? ఏడవక..."

"నీ అమాయకత్వానికీ, అజ్ఞానానికీ నవ్వు కాక ఏడుపొస్తుందా? మా అమ్మ చనిపోయి రెండు పుష్కరాలు గడిచాయి."

"పుష్కరమంటే?"

"పన్నెండేళ్లనుకుంటాను."

"మరిప్పుడు మీ ఆవిడ తాజాగా ఏడుస్తూందేం అత్తయ్యా అంటూ.."


"ఆ అత్తయ్య మా అమ్మ కాదు. తెలుగు టీ.వీ సీరియల్లోని పాత్ర, అంటే మా ఆవిడమేరకు తన జీవితంలోని ప్రధానవ్యక్తి. చాలామంది ఆడవాళ్లలాగే మా ఆవిడకీ టీవీ తెరే ప్రపంచం; దానిమీద చూపే సీరియల్స్ జీవితాలు, వాటిలో పాత్రలే మనుషులు. ఆ అత్తయ్య కిందటి లక్ష్మీవారం చనిపోయింది. శనాదివారాలు సీరియల్‌కి సెలవు. ఈ శుక్రవారం వరకూ కూడా అత్తయ్య శవం లేవలేదు. ఎందరో ఏడవాలిగా. ఆవిడ శవం మీద పడి? అంచేత టీవీ అత్తయ్య శవం సీరియల్లోనూ, టీవీలోనే ఉండిపోయింది. కనుక మా ఆవిడ భోజనం చెయ్యదా శవం లేచేదాకా. ఆవిడ నా పెళ్లాం కనుక... నేనావిడతో నాలుక్కాలాలు కాపురం చెయ్యాలి కనుక యథా భార్య, తథా భర్తా అని నటన. పోయినవాళ్లతోనే కాదు, కట్టుకున్న వాళ్ల సీరియల్స్‌తోనూ మనం పోలేం కనుక ఆవిడనోదార్చేసి మనమిలా వచ్చేసి హోటల్లో తినెయ్యడం. టీవీ అత్తయ్య చావు మా చావు కొచ్చింది. వారం పైనుంచీ యిదే భాగోతం. కడుపు, చించుకుంటే కాళ్లమీద పడుతుందో లేదో కాని ఆవిడగారి సీరియల్ చించుకుంటే..."

తెల్లమొహం వేశాడు గోపాల్. "ఇదా నీ కథ! దీన్నే కాబోలు- కంటే కర్మ కొని పెంచుకున్న ప్రారబ్ధమా?.. అనీ, దత్తపుత్ర శోకమని అంటారు. చూడబోతే ఆంధ్రదేశపు ఆడవాళ్లని తెలుగు టీవీ సీరియల్ ఫీవర్ బాగా పీడిస్తున్నట్లుందే! ఏ యింటి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం.. స్త్రీ జాతి చరిత్ర సమస్తం సీరియళ్ల పరాయణత్వం- అని పాడుకోవాలసి వస్తూందే..." అన్నాడు బాధగా.

"ఫీవర్ కాదది. ఎయిడ్స్ కంటే మహమ్మారి. ఒకసారి సీరియల్ అంటిందో యిక ఆ జన్మ అంతే."

"నీకు నా హృదయపూర్వక సానుభూతి. మీ ఆవిడ సీరియల్ ఎయిడ్స్ నీకంటకుండా తగిన రక్షణకవచం ధరించు. నువ్వు వేగంగా యింటికెళ్లి మీ ఆవిడనోదార్చు. ఆంధ్రదేశానికి సీరియల్ వ్యాధి తగ్గాక కుదురితే మళ్లీ వొచ్చి నీతో గడుపుతాను. బై"

గోపాలం ఆటోని పిలిచి అర్జంటుగా ఎక్కేశాడు. రఘుతో మరొక్క నిముషమున్నా వాళ్లావిడ సీరియల్ ఎయిడ్స్ వయా రఘు తనకంటుతుందేమో అని తెగ భయపడినట్లు. ■



# కూరలు కడక్కుండా తినకండి!

డయెటింగో, మరోటో, దేని కోసమైతేనేమి, సలాడ్లు తినటం ఫాషనైపోయింది. కానీ సలాడ్లు తయారు చేసే ముందు కూరలు, పళ్లను బాగా కడగాలి. కడక్కుండానో, అరకొరగా కడిగో తింటే మెదడులోకి పురుగులు చొచ్చుకుపోయి, 'సిస్టోసైక్రోసిస్' అనే జబ్బు వస్తుందట. పంది మాంసం తినేవారికి కూడా ఈ రోగం వస్తుందట. దీంతో పాటు కంటి చూపు మందగించటం, విపరీతమైన తలనొప్పి, మూర్ఛ, రక్తహీనత వంటివి కూడా వస్తాయట. బ్రెయిన్ ట్యూమర్లు కూడా మెదడులో పురుగులుండటం వల్లనే వస్తున్నాయని నిర్ధారించారు. కనుక కూరలు, పళ్లు అన్నిటినీ శుభ్రంగా ఉప్పు కలిపిన నీటిలో కడిగి తీసుకోవాలి. ముఖ్యంగా కాబేజీని ఆకులుగా విడదీసి మరీ కడగాలట.